

ఆదివారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు


నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

హైదరాబాద్, సోమవారం 19 మే 2025 | RANGAREDDY




వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో నృత్య కిన్నెర మద్దాలి ఉషాగాయత్రి శిష్య బృందం 'మాతృదేవోభవ' కూచిపూడి నృత రూపకం ప్రదర్శించారు. భమిడిపల్లి నరసింహమూర్తి సత్య, కృత, త్రేత, ద్వాపర, కలియుగాల్లో మాతృమూర్తులు పార్వతీదేవి, లీలావతి, సీత, యశోద, వకుళాదేవి ప్రేమను నృతరూపకంలో ప్రదర్శించారు. – కొండాపూర్, మే 18

# నిధుల్లేక.. అభివృద్ధి కానరాక..

**పత్తాలేని ప్రత్యేకాధికారులు.. భారమంతా కార్యదర్శులపైనే..**

**నాటి ఉత్తమ పంచాయతీలు కూడా నేడు నిధుల కోసం వెంపర్లాట**

- నీరసించి పోతున్న పల్లెలు
- ఎన్నికలు లేక నిలిచిపోయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్స్

రంగారెడ్డిజిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు నిధులు లేక నీరసించిపోతున్నాయి. ప్రభుత్వపరంగా రావాల్సిన నిధులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. దీంతో సిబ్బంది జీతభత్యాలు తప్ప.. ఏ ఇతర పనులకూ నిధులు రావడంలేదు. మౌలిక సదుపాయాలకు కూడా ప్రజలు దూరమవుతున్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేకాధికారులు గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. దీంతో గ్రామపంచాయతీల నిర్వహణ భారమంతా కార్యదర్శులపైనే పడింది. దీంతో కార్యదర్శులు కనీస సౌకర్యాలు కల్పించడం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. చేసిన అప్పులు తీర్చడానికి ట్రెజరీలు బిల్లులు పాస్‌చేయడం లేదు. దీంతో కార్యదర్శులు సైతం అప్పలపాలవుతున్నారు. ముఖ్యంగా గ్రామపంచాయతీల్లో వీధి దీపాలు, తాగునీటి పైపులైన్ల మరమ్మతులు, డ్రైనేజీలు క్లీన్ చేయటం, చెత్త సేకరణ, హరితహారం మొక్కల నిర్వహణ, పల్లె ప్రకృతివనాల నిర్వహణ వంటివాటికి కూడా నిధులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాపాలన స్తంభించిపోయింది.

– రంగారెడ్డి, మే 18 (నమస్తే తెలంగాణ)



మాడ్గుల్లో పేరుకుపోయిన మురుగునీరు

గ్రామపంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగిసి సుమారు ఏడాది దాటిపోయింది. అప్పటి నుంచి ఎన్నికలు లేకపోవడం వలన గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. ప్రత్యేకాధికారుల పాలనలోనే ఏడాది దాటిపోయింది. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడం వలన కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ప్రణాళిక నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సంబంధించిన నిధులు కూడా రావడంలేదు. ఈ నిధుల వల్లే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగేవి. నిధులు రాకపోవడం వలన గ్రామాల్లో పనులు ముందుకు సాగడంలేదు.

## పత్తాలేని ప్రత్యేకాధికారులు

గ్రామపంచాయతీల నిర్వహణ బాధ్యత కోసం ప్రభుత్వం ప్రత్యేకాధికారులను ఏర్పాటుచేసింది. కాని, ప్రత్యేకాధికారులు మాత్రం గ్రామాలవైపు కన్నెత్తి చూడడంలేదు. ప్రత్యేకాధికారులు ఆయా శాఖల్లో పని ఒత్తిళ్లతో గ్రామాలవైపు కన్నెత్తి చూడడంలేదు. దీంతో గ్రామాల నిర్వహణ బాధ్యత పూర్తిగా కార్యదర్శులపైనే పడింది. తరచుగా పైపులైన్ల లీకేజీ, వీధి దీపాలు పాడైపోవడం వంటివి జరుగుతున్నాయి. పైపులైన్ల మరమ్మతులకు, వీధి దీపాల కోసం కార్యదర్శులే అప్పులు చేసి మరమ్మతులు చేయిస్తున్నారు. కాని, వారు చేసిన అప్పులు తీర్చడం కోసం పంచాయతీ నిధుల నుంచి తీసుకోలేకపోతున్నారు. దీంతో కార్యదర్శులంతా అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు.

## కనిపించని అభివృద్ధి పనులు

గ్రామపంచాయతీలకు నిధుల కొరత కారణంగా గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడంలేదు. ముఖ్యంగా రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, ఇతరత్రా అభివృద్ధి పనులకు నిధులు లేకపోవడం వలన ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గ్రామపంచాయతీలకు ప్రత్యేక నిధులంటూ లేకపోవడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడంలేదు. ఎమ్మెల్యే నిధుల నుంచి వచ్చే కొద్దిపాటి నిధులు తప్ప ఏ ఇతర నిధులు రావడంలేదు.

## బీఆర్ఎస్ పాలనలో అవార్డులందుకున్న గ్రామాలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి సాధించాయి. గ్రామాలకు ప్రభుత్వం నిధులు కేటాయించడంతో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పల్లె ప్రకృతి వనాలు, హరితహారం, చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోయాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల కింద సుమారు జిల్లాలో 20కిపైగా గ్రామాలు అవార్డులు అందుకున్నాయి. ప్రస్తుతం ఆ గ్రామాలు కూడా నిధులులేక ఎక్కడికక్కడే స్తంభించిపోయాయి.

## చెల్లింపులు నిలిపివేసిన ట్రెజరీలు

ఆయా గ్రామపంచాయతీలకు సంబంధించి ట్యాక్సీల వసూళ్లను కార్యదర్శులు గ్రామపంచాయతీ ఖాతాల్లో జమచేస్తున్నారు. ఖాతాల్లో జమచేసిన డబ్బులు తిరిగి చెల్లించవద్దని ప్రభుత్వం ట్రెజరీలకు ఆదేశాలు జారీచేసింది. దీంతో ట్రెజరీలు కేవలం పంచాయతీ సిబ్బంది జీతభత్యాలు తప్పా ఏ ఇతర బిల్లులకు కూడా చెల్లింపులకు అనుమతి ఇవ్వడంలేదు. దీంతో చెత్త సేకరణ ట్రాక్టర్ల నిర్వహణ కూడా భారంగా మారింది. దీంతో పలుచోట్ల ట్రాక్టర్లు డీజిల్ లేక మూలనపడ్డాయి. అలాగే, గత ఆరునెలలుగా పంచాయతీ సిబ్బంది జీతభత్యాలు కూడా చెల్లించకపోవడంతో వారు కూడా ఆందోళన బాట పడుతున్నారు.



లోయపల్లిలో నడిరోడ్డుపై విరిగిపోయిన మ్యాన్‌హోల్ పైకప్పు

## అంతంతమాత్రంగానే పన్నుల వసూళ్లు

రంగారెడ్డిజిల్లా వ్యాప్తంగా 21 మండలాలు 531 గ్రామపంచాయతీలున్నాయి. వీటిలో కడ్తాల్, కొందుర్గు, కేశంపేట, మాడ్గుల, మంచాల, నందిగామ, తలకొండపల్లి, యాచారం వంటి మండలాలు పూర్తిగా గ్రామీణప్రాంతాలు కావడం వలన పన్నులు కూడా అంతంతమాత్రంగానే వసూళ్లవుతున్నాయి. ఈ గ్రామాలకు ఎలాంటి నిధులు చెల్లించకపోవడం వలన అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పంచాయతీ కార్యదర్శులు అతిభారంగా వీటి నిర్వహణ భారాన్ని భుజాలపై వేసుకుని మోస్తున్నారు.



మాడ్గుల మండలం నల్లచెరువు గ్రామంలో పొంగిపొర్లుతున్న మురుగునీటికాల్వ



నిర్వహణ లేక ఎండిపోయిన హరితహారం మొక్కలు

## గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. కాని, ప్రస్తుతం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గ్రామపంచాయతీల నిర్వహణ కూడా కార్యదర్శులకు భారంగా మారింది. రోడ్లపై మురుగునీరు పారడం, దోమల స్వైర విహారంతో పాటు మరిన్ని సమస్యలతో ప్రజలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలన రీతిలో సాగుతున్నది. చేతకాని ముఖ్యమంత్రితో రాష్ట్రం ఇబ్బందుల్లో పడింది.

– ఏనుగు భరత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ

## సకాలంలో అందని వేతనాలు



గ్రామపంచాయతీ సిబ్బందికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సకాలంలో వేతనాలు అందించడంలేదు, ఎన్నికల ముందు పంచాయతీ సిబ్బందికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించి సకాలంలో వేతనాలు ఇస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు పట్టించుకోవడంలేదు. గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి సుమారు ఆరు నెలల నుంచి వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు.

– పోచమోని కృష్ణ, సీఐటీయూ నాయకుడు

# తడిసి.. ముద్దయి..

**రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం**

- కొనుగోళ్లలో జాప్యం.. అన్నదాతను కుంగదీస్తున్న అకాల వర్షాలు
- కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యం
- కేంద్రాల నిర్వాహకులను వేధిస్తున్న హమాలీలు, లారీల కొరత



కల్లంలో తడిసిన ధాన్యం

**ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేంద్రాల నిర్వాహకుల అనేక కొర్రీలు.. హమాలీలు, లారీల కొరత ధాన్యం కొనుగోళ్లకు తీవ్రఅడ్డంకిగా మారి.. కేంద్రాల వద్దే అన్నదాతలు రోజుల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొన్నది. అంతేకాకుండా అకాల వర్షాలు రైతన్నను మరింత కుంగదీస్తున్నాయి. తడిసిన ధాన్యాన్ని కొనేందుకు తేమ పేరుతో ధర తగ్గించడంతో పాటు తూకాల్లో మోసాలకూ పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి.**

– రంగారెడ్డి, మే 18 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పలు కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచిన ధాన్యం తడిసి ముద్దయింది. అన్నదాతలు ధాన్యం విక్రయం కోసం ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, మాడ్గుల, ఆమనగల్లు, కడ్తాల్ తదితర మండలాల నుంచి కొనుగోలు కేంద్రాలకు పెద్దఎత్తున వడ్లను తీసుకొచ్చి నిల్వ చేశారు. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా కురిసిన వానతో ధాన్యం మొత్తం తడిసిపోయింది. కాగా, తడిసిన ధాన్యాన్ని తీసుకు నేందుకు కేంద్రాల నిర్వాహకులు ఆసక్తి చూపకపోవడంతో వడ్లకు మొలకలు వచ్చి.. పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంటుందని.. అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్నీ కొనేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

## వెంటాడుతున్న హమాలీలు, లారీల కొరత

కొనుగోలు కేంద్రాల్లో వడ్లను తూకం వేసేందుకు హమాలీలు.. కాంటా వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు లారీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేందుకు లారీలు సక్రమంగా రాకపోవడంతో అక్కడ ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో కొను గోలు కేంద్రాల నిర్వాహకులు ఆ నిల్వలు రైస్ మిల్లులకు తరలిన తర్వాతే ఇతర వడ్లను కొంటామని అన్నదాతలకు చెబుతుండడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా హమాలీలు సరిపడా లేకపోవడంతో కేంద్రాల్లో కొనుగోళ్లు సజావుగా సాగడంలేదు. దీంతో అన్నదాతలు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే నిరీక్షించాల్సి వస్తున్నది.



చిగురాల్‌పల్లిలో తడిసిన మొక్కజొన్నను ఒక దగ్గర పోస్తున్న మహిళా రైతు

## నానిన మొక్కజొన్నలు

**పరిగి :** పరిగి పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ఉండగా మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల ధాన్యాన్ని ఆరబెట్టినవారు టార్పాలిన్లు కప్పగా.. పొలాల దగ్గర ఆరబోసిన వారి ధాన్యం తడిసిపోయింది. చిగురాల్‌పల్లి గ్రామంలో పొలం వద్ద ఆరబెట్టిన మొక్కజొన్నలు వర్షానికి నానిపోయాయి.



ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

## కొరవడిన పర్యవేక్షణ

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్న తరుణంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడి అన్నదాతలు ఇబ్బందులెదుర్కొంటున్నారు. ధాన్యాన్ని విక్రయానికి తీసుకొస్తే .. కేంద్రాల నిర్వాహకులు పలు కొర్రీలు పెడుతుండడంతో రైతన్నలు అక్కడే రోజుల తరబడిగా నిరీక్షించాల్సి వస్తున్నది. దీంతో కేంద్రాల్లో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి.

# దోశలో బొద్దింక!



షాద్‌నగర్, మే 18 : నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాల్సిన హోటళ్ల నిర్వాహకులు నాసిరకం, కల్తీ, పురుగులతో కూడిన ఆహారాన్ని వడ్డించడంతో వినియోగదారులు అనారోగ్యంపాలవుతున్నారు. షాద్‌నగర్‌లోని రాఘవేంద్ర హోటల్‌లో ఆదివారం టిఫిన్ చేసేందుకు వచ్చిన ఓ వినియోగదారుడికి చేదు అనుభవం ఎదురైంది. తినేందుకు దోశను ఆర్డర్ ఇచ్చిన అతడు సగం దోశను తిన్న తరువాత దోశలో బొద్దింక దర్శనమిచ్చింది. దీంతో ఆ వినియోగదారుడు వాంతులు చేసుకున్నాడు. ఇలా తరచుగా సంఘటనలు వెలుగుచూస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఇదే హోటల్‌లో పలుమార్లు ఆహార పదార్థాల్లో పురుగులు, ఈగలు, దోమలు, బొద్దింకలు దర్శనమిచ్చిన ఘటనలు ఉన్నాయని, ఆహార వడ్డింపు, తయారీ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న హోటల్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

# మొఘల్స్ కాలనీలో షార్ట్ సర్క్యూట్

**50 మందిని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది**

మైలార్‌దేవ్‌పల్లి, మే 18 : పాతబస్తీలోని గుల్జార్‌హౌస్ ఘటన జరిగిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే మైలార్‌దేవ్‌పల్లిలోని మొఘల్ కాలనీలోని ఓ మూడంతస్తుల భవనంలో మరో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పడమే కాకుండా మంటల్లో చిక్కుకున్నవారిని బయటకు తీసుకురావడంతో పెద్దసంఖ్యలో ప్రాణ నష్టం తప్పింది. మైలార్ దేవ్‌పల్లి డివిజన్ ఉడ్డెంగడ్డ, మొఘల్స్ కాలనీ ప్రాంతంలో షేక్ మాజీద్‌కు చెందిన మూడంతస్తుల భవనంలో మరో ఏడు కుటుంబాలు అద్దెకుంటున్నాయి. ఆదివారం ఉదయం భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో విద్యుత్ మీటర్ల వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. మంటలు గ్రౌండ్ ఫ్లోర్‌లోని పాత ఫర్నీచర్, ఇతర వస్తువులకు వ్యాపించడంతో భవనంలోని మూడు అంతస్తుల వరకు దట్టమైన పొగ అలుముకుంది. ఒక్కసారిగా మంటలు, పొగల ధాటికి నిద్రలేచి, బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో భవనం టెర్రస్ పైకి పరుగులు తీసి, హాహాకారాలు చేశారు. చాంద్రాయణగుట్ట ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేసి.. చిక్కుకుపోయిన 16 మంది పిల్లలు, 34 మంది పెద్దలు, వృద్ధులను సురక్షితంగా బయటికి తీసుకువచ్చి ప్రాణాలు కాపాడారు.



